సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 14 । జూలై । 2025



అద్భుతం.. అద్వితీయం

పట్టు వస్త్రాల డిజైనింగ్‌లో ధర్మవరానికి చెందిన నాగరాజు అద్భుతాలతో ఆకట్టుకుంటున్నాడు.

8లో

అపరిష్కృత వేదిక

- ఫిర్యాదు ఇచ్చిన మూడు రోజులకే 'పరిష్కారం' సందేశం
- వాస్తవంగా నెలలు దాటుతున్నా పరిష్కారం కాని సమస్యలు
- 'పరిష్కార వేదిక'పై నమ్మకం కోల్పోతున్న ఫిర్యాదుదారులు

పుట్టపర్తి మండలం కప్పలబండ గ్రామానికి చెందిన ఏకిల శేఖర్.. పంచాయతీ నిధులు దుర్వినియోగమయ్యాయని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జూన్ మొదటి వారం నుంచి జూలై 7 వరకు ప్రతి సోమవారం ఫిర్యాదు ఇచ్చాడు. మూడు రోజుల తర్వాత గురువారం రోజున అధికారులు తమను సంప్రదిస్తారనే మెసేజీ వస్తుంది. శనివారం రోజున పరిష్కారమైనట్లు మెసేజీ వచ్చేస్తోంది. కానీ తిరిగి సోమవారం అదే సమస్యపై ఫిర్యాదు చేస్తున్నాడు. కూటమి ప్రభుత్వంలో ఏమిటీ అర్థం కాని సమస్య అంటూ మీడియాకు వివరించాడు. అధికారులు తనను ఎవరూ సంప్రదించిన దాఖలాలు కూడా లేవని స్పష్టం చేశాడు.

పుట్టపర్తి మున్సిపాలిటీ ఎనుములపల్లికి చెందిన చిమిరాల జగన్నాథ తన భూమిని ఇతరులు ఆక్రమించారని గత మార్చి 17న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాడు. అంతకుముందు అదే సమస్యపై ఐదుసార్లు ఫిర్యాదు చేశాడు. మార్చి 20న అధికారులు సంప్రదిస్తారని మొబైల్‌కు మెసేజీ వచ్చింది. ఎక్కడికీ వెళ్లకుండా అధికారుల కోసం ఇంటి దగ్గర ఎదురు చూశాడు. అయినా ఎవరూ రాలేదు. మరుసటి రోజు సమస్య పరిష్కారం చేసినట్లు మరో సందేశం వచ్చింది. దీంతో ఇంకెన్నిసార్లు ఫిర్యాదు చేసినా పరిష్కారం కాదని భావించి ఫిర్యాదు ఇవ్వడమే మానేశాడు.



ఫిర్యాదుదారులతో కిటకిటలాడుతున్న కలెక్టరేట్ (ఫైల్)



కలెక్టరేట్‌లో నిద్రమత్తులో అధికారులు (ఫైల్)

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీల గణాంకాలు	
(కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జూలై 7 వరకు)	
కలెక్టరేట్‌కు వచ్చిన ఫిర్యాదులు	27,138
పరిష్కారమైనవి	24,736

సాక్షి, పుట్టపర్తి: ఫిర్యాదు ఇచ్చిన వెంటనే ఆన్‌లైన్ ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయాని(సీఎంఓ)కి వెళ్తుందని, గంటల వ్యవధిలోనే పరిష్కారం అవుతుందని కూటమి పాలకులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడి సమస్యలు అక్కడే అటకెక్కాయి. కానీ సదరు సమస్యలు పరిష్కారమైనట్లు ఫిర్యాదుదారుల మొబైల్స్‌కు సందేశాలు (మెసేజీలు) పంపుతున్నారు. దీంతో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. నెలల తరబడి తిరుగుతున్నా.. కనీసం సంప్రదించే వారు కూడా లేకుండానే.. 'పరిష్కార' జాబితాలోకి చేరుస్తున్నారు. ఒకే సమస్యపై పదుల సంఖ్యలో కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న వారు వందల సంఖ్యలో ఉన్నారు. జిల్లాలో ఇటీవల పరిష్కారం కాని సమస్యలకు 'పరిష్కారమైనట్లు' పంపిన సందేశాలపై చర్చ మొదలైంది. ప్రతి వారం వచ్చే ఫిర్యాదులన్నీ.. సీఎంఓకు వెళ్తాయని.. తప్పక పరిష్కారం లభిస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశ ఎదురవుతోంది. పరిష్కారమైనట్లు అధికారికంగా ప్రకటిస్తుండటంతో.. పిటిషన్ రీ–ఓపెన్ చేయాలా? లేక మరోసారి ఫిర్యాదు చేయాలా? అనేది అర్థం కాని అంశంగా మారింది. పరిష్కారం కాలేదని పదే పదే ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతోందని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరేట్‌కు ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్లిన సమయంలో చాలామంది అధికారులు సెల్ ఫోన్లలో బిజీగా ఉంటున్నారని.. కొందరు కునుకు తీస్తున్నారని ప్రజలే చెబుతున్నారు.

అధికారుల ఇష్టారాజ్యం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కలెక్టర్ ఎదురుగా ఉన్నప్పటికీ ఏమీ పట్టనట్లు సెల్ ఫోన్లలో బిజీబిజీగా గడుపుతున్నారు. ఫోన్లు మాట్లాడటం పక్కన బెడితే.. యూట్యూబ్‌లో వీడియోలు చూస్తూ, గేమ్‌లు ఆడుతూ కాలయాపన చేస్తున్నారు. తమ విభాగానికి వచ్చిన ఫిర్యాదుల గురించి పట్టించుకోవడం మానేశారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారుల బాగోతం వీడియోల రూపంలో బయటికి వస్తూనే ఉంది. సామాజిక మాధ్యమాల్లో అధికారులు గేమ్‌లు ఆడుతున్న దృశ్యాలు, యూట్యూబ్‌లో వీడియోలు చూస్తున్నది.. భయం లేకుండా నిద్రపోతున్న ఫొటోలు చక్కర్లు కొడుతున్నాయి.

ఇప్పటికీ పరిష్కారం కాలేదు



ప్రతి సోమవారం వరుసగా ఎనిమిది సార్లు పలు సమస్యలపై కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఫిర్యాదులు ఇచ్చాను. అలా ఇచ్చిన మూడు రోజులకే అధికారులు సంప్రదిస్తారనే సందేశం నా ఫోన్‌కు వస్తుంది. కానీ అధికారులు ఎవరూ నాకు కనీసం ఫోన్ కాల్ కూడా చేయరు. ఆ తర్వాత రోజు మీ సమస్య పరిష్కారం అయినది అంటూ మరో మెసేజీ పంపిస్తున్నారు. కానీ ఇప్పటి వరకు నేను ఇచ్చిన అర్జీల్లో ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదు.

– ఎస్.రామకృష్ణారెడ్డి, చిలమత్తూరు



గేమ్ ఆడుతూ బిజీబిజీగా.. (ఫైల్)

న్యూస్‌రీల్

పరవశభరితం.. నృత్య రూపకం



'ఐయామ్ సాయి బాబా' నృత్య రూపకంలోని ఓ ఘట్టం

ప్రశాంతి నిలయం: సత్యసాయి అవతార వైభవాన్ని చాటుతూ సాగిన చిన్నారుల ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శన భక్తులను పరవశభరితులను చేసింది. పర్తి యాత్రలో భాగంగా పట్టపర్తికి విచ్చేసిన యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా భక్తులు ఆదివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ సత్యసాయి ఎడ్యుకేషన్‌కు చెందిన చిన్నారులు 'ఐ యామ్ సాయిబాబా' పేరుతో సంగీత నృత్యరూపకం ప్రదర్శించారు. సత్యసాయి బాల్యం, విద్యాభ్యాసం, అవతార ప్రకటన, మానవాళికి అందించిన సేవలు తదితర అంశాలను చక్కగా వివరించారు. అనంతరం చిన్నారులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

క్రిప్టో మాటున లూటీ

వెలుగులోకి మరో మోసం

- రూ.లక్ష కడితే రోజూ 20 యూఎస్ డాలర్లు అంటూ ఎర
- కోట్లాది రూపాయలు అప్పులు తెచ్చి మరీ కట్టిన అమాయకులు
- తాజాగా జెండా ఎత్తేయడంతో లబోదిబోమంటున్న వైనం



అనంతపురం: మరో ఆన్‌లైన్ మోసం వెలుగులోకి వచ్చింది. 'లుక్' యాప్ తరహాలోనే మాయగాళ్లు బురిడీ కొట్టించారు. క్రిప్టో మాటున రూ. కోట్లు లూటీ చేసినట్లు తెలిసింది. క్రిప్టో కరెన్సీ అనేది ఒక డిజిటల్ కరెన్సీ. ఇది ఏ దేశానికీ చెందింది కాదు. ఏ నియంత్రణ సంస్థ పరిధిలోకి రాదు. ప్రభుత్వ నియంత్రణ కానీ, స్వతంత్ర సంస్థ అదుపులో కానీ ఉండదు. ఇద్దరు వ్యక్తులు లేదా సంస్థల మధ్య నేరుగా బదిలీ చేసుకోగల డిజిటల్ కరెన్సీ మాత్రమే. ఈ కరెన్సీకి ఎలాంటి చట్టబద్ధత ఉండదు. కానీ కొన్ని రోజుల క్రితం విశాఖపట్నంకు చెందిన కొందరు వ్యక్తులు అనంతపురం నగరంలో పాగా వేసి వందలాది మందిని క్రిప్టో ముగ్గులోకి లాగారు. లక్ష నుంచి కోటి రూపాయల వరకు ఒక్కొక్కరి దగ్గర డిపాజిట్ చేయించుకున్నారు. రూ. లక్ష కడితే రోజూ 15 నుంచి 20 అమెరికన్ డాలర్లు ఇస్తామని నమ్మబలికారు. మాయగాళ్ల ఉచ్చులో పడిన పలువురు వారు చెప్పినట్లుగానే డిపాజిట్లు చేశారు. మొదట్లో లాభాలు బాగానే రావడంతో తెలిసిన వారు, బంధువుల నుంచి కూడా డబ్బులు డిపాజిట్ చేయించారు. నిర్వాహకులు కేవలం వెబ్‌సైట్‌లోనే లావాదేవీలు నిర్వహించారు. ఓ 'ఫండ్' పేరుతో మొదలైన దందా.. రెండు నెలలకే పేరు మార్చుకుంది. అదేంటంటే సాంకేతిక మార్పులు అని సర్దిచెప్పారు. ఈ క్రమంలో డబ్బు డిపాజిట్ చేస్తే రెట్టింపు అవుతాయని ఆశ చూపించి.. వారి నుంచి రూ.కోట్లు వసూలు చేశారు. తర్వాత ఒక్కసారిగా దుకాణం ఎత్తేశారు. ఉమ్మడి జిల్లాలో వందల మంది అమాయకులు మోసపోయినట్లు తెలిసింది. బాధితుల్లో అధికంగా చిరు వ్యాపారులు ఉన్నట్లు సమాచారం.

రిటైర్డ్ ఉద్యోగికి భారీ బురిడీ..

అనంతపురంలో ఆర్టీసీలో పదవీ విరమణ చేసిన ఓ ఉద్యోగి క్రిప్టో కరెన్సీ మోజులో పడ్డారు. తొలుత భారీ ఆదాయం రావడంతో మరికొంత మందితో సభ్యత్వం కట్టిస్తే మరింత లాభం వస్తుందని ఆశ పడ్డాడు. బంధువులు, స్నేహితులు అందరికీ క్రిప్టో కరెన్సీ గురించి చెప్పాడు. 'నేను కోటి రూపాయల వరకు చెల్లించా. మీరు కూడా పెట్టండి.. మంచి లాభాలు వస్తాయి. ఏడాదికే డబుల్ ఆదాయం సొంతమవుతుంది' అని వివరించాడు. తనకు లాభాలు వచ్చాయని ఆధారాలు సైతం చూపించాడు. దీంతో స్నేహితులంతా కలిసి రూ.5 కోట్లు పోగేశారు. విశాఖపట్నంకు వెళ్లి మరీ ఓ వ్యక్తికి నగదు ముట్టజెప్పారు. తాజాగా మొదటికే మోసం రావడంతో లబోదిబోమంటున్నట్లు తెలిసింది. విశాఖపట్నం ఏజెంట్ ఫోన్ నంబరు పనిచేయకపోవడంతో లోలోపలే కుమిలిపోతున్నట్లు సమాచారం.

క్రిప్టోలో చాలామంది పెట్టుబడులు..

క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే.. డాలర్లలో సంపాదన ఉంటుందన్న ఆశ మధ్య తరగతి ప్రజలను ఆకర్షిస్తోంది. క్రిప్టో పేరుతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొనసాగుతున్న వ్యాపారంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. తమ వద్ద ఉన్న డబ్బుతో పాటు అప్పులు తెచ్చి మరీ ఇందులో పెట్టుబడులు పెట్టడంతో మొదటికే మోసం వస్తోంది. మొత్తం డబ్బు పోవడంతో అప్పులు తీర్చే మార్గం లేక నరకయాతన అనుభవిస్తున్నారు. మోసపోయామని చెబితే బంధువులు, సమాజంలో మర్యాద పోతుందని మిన్నకుండిపోతున్నారు.

మహిళలకు రక్షణ కరువు

- అరాచక పాలనకు చరమగీతం పాడదాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, పార్లమెంట్ పరిశీలకుడు రమేష్‌రెడ్డి, సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ తదితరులు

గాండ్లపెంట: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం మాటున సాగుతున్న అరాచక పాలనకు చరమగీతం పాడదామని పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రం గాండ్లపెంటలోని 'ఫ్రెండ్స్ ఫంక్షన్ హాలులో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అడుగుపెట్టిన ప్రతిసారీ తనను పొలిమేరలు దాటనివ్వనంటూ ఎమ్మెల్యే కందికుంట అవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. మీరు నిలబెట్టి వసూలు చేసే వాహనంలో తాను రావడం లేదని.. నేను వచ్చే వాహనం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగన్నాథ రథ చక్రం అని.. బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే మంచిదని హెచ్చరించారు. అనవసరపు మాటలు మాని.. ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని మితవు పలికారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ గూండాలు దాడికి పాల్పడితే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దాడి జరుగుతున్నపుడు పోలీసులు చోద్యం చూడటాన్ని తప్పుపట్టారు. అధికారం ఉంది కదా అని రెచ్చిపోవడం మంచిది కాదన్నారు. కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుందన్నారు. అరాచకాలు.. దౌర్జన్యాలను నిరసిస్తూ ఈ నెల 16న రామగిరి ఎంపీపీ ఎన్నికను వైఎస్సార్‌సీపీ బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు.

మోసం చేయడం.. బాబు నైజం

హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ హామీలు ఇవ్వడం.. అమలు చేయకుండా మోసం చేయడం చంద్రబాబు నైజమని విరుచుకుపడ్డారు. ప్రజలు ఏ మేరకు మోసపోయారో 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ' క్యూ ఆర్ కోడ్ ద్వారా బేరీజు వేసుకుని, చైతన్యవంతులు కావాలని సూచించారు. సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల అమలు చేయకుండా సీఎం చంద్రబాబు ప్రజలను దారుణంగా వంచించారని మండిపడ్డారు. ఆయన రాజకీయ జీవితం మొత్తం అబద్ధాలతోనే సాగుతోందని ఎద్దేవా చేశారు. అధికారం కోసం ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇస్తుంటారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ యాక్టివిటీ కార్యదర్శి వజ్ర భాస్కర్ రెడ్డి, మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే పార్టీ మండల నాయకులు మాజీ ఎంపీపీ జగన్మోహన్, పామిడి ఇక్బాల్, శంకర్‌నాయుడు, ఎస్పీ హైదర్‌వలి, సీఎస్ అబ్దుల్ రవూఫ్, మాజీ కన్వీనర్ పోరెడ్డిచంద్రశేఖర రెడ్డి, కటారుపల్లిక్రాస్ ర వికుమార్, హుస్సేన్‌పీరా, గోపాల్‌నాయక్, మేకల నరసింహులు, సర్పంచ్‌లు నాగభూషణంరెడ్డి, ఉత్తన్న, సోమందేపల్లి ఎంపీపీ వేణుగోపాల్, పార్టీ కదిరి పట్టణ అధ్యక్షుడు బాబ్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టిప్పర్ ఢీ - వృద్ధుడి మృతి

ముదిగుబ్బ: టిప్పర్ ఢీ కొనడంతో ముదిగుబ్బ మండలం రామస్వామినాయక్ తండాకు చెందిన శ్రీనివాసులునాయక్‌ను(62) దుర్మరణం పాలయ్యాడు. స్వగ్రామం నుంచి ముదిగుబ్బ-పుట్టపర్తి రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ ఢీకొంది. మృతునికి భార్య తులసీబాయి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య


మృతురాలు మంజుల

పరిగి: మండలంలోని మోదా పంచాయతీ పుట్టగూర్లపల్లిలో వివాహిత మంజుల(22) ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపిన మేరకు.. పుట్టగూర్లపల్లి నివాసి శ్రీనివాసులు తన కుమార్తె మంజులను అదే గ్రామానికి చెందిన సమీప బంధువు కుమారుడు జయచంద్రకు ఇచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం జరిపించాడు. కూలి పనులతో జీవనం సాగించేవారు. ఏడాది కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్న ఆమె ఆదివారం నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. గమనించిన బంధువులు వెంటనే హిందూపురంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ చేతన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీఆర్ఎస్ మందిరంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక ఉంటుందని, ప్రజలు తమ సమస్యలపై నేరుగా అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు.

నేడు పోలీస్ కార్యాలయంలో...

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అందజేస్తే పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆంధ్రా క్రికెట్ జట్టులో చోటు

అనంతపురం: ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకూ ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులో జరిగే వన్డే క్రికెట్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఆంధ్రా అండర్-19 పురుషుల క్రికెట్ జట్టులో జిల్లాకు నుంచి ఐదుగురికి చోటు దక్కింది. వీరిలో కోగటం హనీష్ వీరారెడ్డి, టీవీ సాయి ప్రతాపరెడ్డి, ఎ.జయంత్ కృష్ణ (తాడిపత్రి), ఎం.భువనేశ్వర్ (గుత్తి), ఎస్.రెహాన్ (గుంతకల్లు) ఉన్నారు.



డిజైనర్ నాగరాజు పట్టు వస్త్రంపై తయారు చేసిన చిత్రాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము


ఒకే పట్టువస్త్రంపై వైఎస్సార్, వైఎస్ జగన్ చిత్రాలు


పట్టు వస్త్రంపై దేశంలోని అన్ని భాషలలో శ్రీరామ నామాలను రూపొందించిన దృశ్యం

అద్భుతం.. అద్వితీయం

- పట్టు వస్త్రాలపై విభిన్నమైన డిజైన్లతో ఆకట్టుకుంటున్న నాగరాజు
- ఉత్తమ డిజైనర్‌గా జాతీయస్థాయి అవార్డులు అందుకున్న సాధారణ చేనేత కార్మికుడు


ఎన్‌హెచ్‌డీసీ అవార్డు దక్కించుకున్న పట్టు శాలువాపై ఉప్పు సత్యాగ్రహదీక్ష ఘట్టాలు

ధర్మవరం: అతడో సాధారణ చేనేత కార్మికుడు.. అద్భుతమైన మేధాసంపత్తి ఉంది.. పట్టుచీరల డిజైన్లను రొటీన్‌కు భిన్నంగా కళాత్మకంగా రూపొందించడం అతడి ప్రత్యేకత. 2009లో హ్యాండ్‌లూమ్ విభాగంలో క్లస్టర్ డిజైనర్‌గా ఉద్యోగం పొందారు. అప్పటి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు, ప్రశంసా పత్రాలు పొందారు. తనలోని కళను పలువురికి నేర్పుతూ పట్టు విశిష్టతను ప్రపంచానికి డిజైన్ల రూపంలో చాటుతున్న ధర్మవరానికి చెందిన నాగరాజు ఈ ఏడాది ఆగస్టు 7న చేనేత దినోత్సవం సందర్భంగా ఢిల్లీ వేదికగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఉత్తమ డిజైనర్ అవార్డు అందుకోనున్నారు.

సాంబ సినిమాతో ఆరంభం

ధర్మవరం పట్టణానికి చెందిన జూజారు నాగరాజు మగ్గం నేసుకుంటూ డిగ్రీ వరకు చదివారు. డిజైనింగ్ మీద మక్కువతో బెంగుళూరు, హైద్రాబాద్‌లో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు పూర్తి చేశారు. అనంతరం పట్టుచీరలపై కళాత్మకంగా వెరైటీ డిజైన్‌లు రూపొందిస్తూ తనలోని కళాకారుడిని ఈ లోకానికి పరిచయం చేశారు. జూనియర్ ఎన్టీఆర్ నటించిన సాంబ చిత్రంలో ఓ సన్నివేశానికి గానూ శంఖు, చక్రం, నామాలతో కూడిన డిజైన్‌ను బంగారు తాపడంతో పట్టు వస్త్రంపై 2004లో నాగరాజు రూపొందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ డిజైన్ ప్రాచుర్యం పొందడంతో నాగరాజుకు పేరు వచ్చింది. ఆ తర్వాత 2009లో అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం ప్రతిభ ఉన్న వారికి ఔట్ సోర్సింగ్ ద్వారా హ్యాండ్‌లూమ్‌లో డిజైనర్ ఉద్యోగాలకు ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో ధర్మవరం హ్యాండ్‌లూమ్ క్లస్టర్ డిజైనర్‌గా నాగరాజుకు ఉద్యోగం వచ్చింది. ధర్మవరంతో పాటు ముదిరెడ్డిపల్లి, మంగళగిరి తదితర ప్రాంతాలలో చేనేత కార్మికులకు డిజైనింగ్ రంగంలో శిక్షణ ఇచ్చారు.

అందుకున్న అవార్డులు

- 2006లో ఉమ్మడి రాష్ట్రంలో డిజైన్ డెవలప్‌మెంట్‌లో ప్రతిభ చాటినందుకు గాను రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు.
- 2020, మార్చిలో ఢిల్లీలో నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాతీయ అవార్డును అందుకున్నారు. మహాత్ముని ఉప్పు సత్యాగ్రహం చిత్రాలను పట్టు వస్త్రంపై రూపొందించినందుకు గాను ఈ అవార్డు దక్కింది.
- 2024, ఆగస్టు 15న ఏపీ అట్ హోం కార్యక్రమంలో భాగంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో చేనేతల తరపున పాల్గొనే అవకాశం దక్కింది.
- ఈ ఏడాది మార్చిలో రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన వివిధ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో పాల్గొని చేనేత విశిష్టతను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు వివరించారు.
- ఈ ఏడాది ఆగస్టు 7న కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే చేనేత దినోత్సవంలో ఉత్తమ డిజైనర్ అవార్డును నాగరాజును అందుకోనున్నారు.

ప్రశంసలు అందుకున్న డిజైన్‌లు

- ఖాదీ విలేజ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో పట్టు వస్త్రాలపై తాజ్‌మహల్ చిత్రాలను రూపొందించి ప్రదర్శించారు.
- 2016లో లేపాక్షి ఆలయంలోని శిల్పాలను పట్టు వస్త్రంపై చేనేత మగ్గం సాయంతో అద్భుతంగా తయారు చేసి ప్రదర్శించారు.
- 2017, ఫిబ్రవరిలో ఇస్రో రాకెట్ ప్రయోగాల విజయవంపై హర్షం వ్యక్తం చేస్తూ ఇస్రో శాటిలైట్‌లు, రాకెట్ చిత్రాలను పట్టు వస్త్రంపై తయారు చేసి విజయవాడలో ప్రదర్శించారు.
- ప్రముఖ పుణ్య క్షేత్రం పానకాల లక్ష్మీనరసింహ స్వామి చిత్రం, గాలి గోపురాన్ని పట్టు వస్త్రంపై డిజైన్ చేసి ఆలయానికి అందజేశారు.
- 2019లో గాంధీ జయంతిని పురస్కరించుకుని మహాత్ముని దండీ యాత్రను పట్టు వస్త్రంపై రూపొందించి ఢిల్లీలో జరిగిన నేషనల్ హ్యాండ్ లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో రాష్ట్రం తరపున ప్రదర్శించారు.
- 2019, డిసెంబర్‌లో సీఎం వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా పట్టు వస్త్రంపై సీఎం జగన్ చిత్రాన్ని రూపొందించి హ్యాండ్‌లూమ్ కార్యాలయం తరఫున నేతన్న నేస్తం పథకం ప్రారంభంలో ధర్మవరంలో జగనన్నకు బహూకరించారు.
- ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ ఫెర్రర్ సతీమణి అన్నే ఫెర్రర్ చిత్రాన్ని పట్టు వస్త్రంపై తయారు చేసి ఆమెకు అందజేశారు.
- 2021లో అయోధ్యలోని రామయ్యకు కానుకగా శ్రీరామ కోటి పట్టు వస్త్రాన్ని తయారు చేసి వంపారు.
- 2022లో త్రీడీ శారీ తయారు చేసి ఒకే పట్టు చీరపై మూడు డిజైన్‌లు రూపొందించి అబ్బురపరిచాడు.
- ఈ ఏడాది రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ చిత్రంతో కూడిన పట్టు వస్త్రాన్ని తయారు చేసి ఆమెకు బహూకరించారు.

ఎంతో ఆనందంగా ఉంది



సాధారణ చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్న నేను.. ఆసక్తితో డిజైనర్‌గా శిక్షణ తీసుకుని ఎన్నో విభిన్నమైన డిజైన్‌లను రూపొందించాను. చేనేతల సత్తాను జాతీయ స్థాయిలో చాటాలన్నదే నా సంకల్పం. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో పలు అవార్డులతో పాటు ఎన్‌హెచ్‌డీసీ తరపున జాతీయ అవార్డు అందుకున్నా. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఉత్తమ డిజైనర్‌గా జాతీయస్థాయి అవార్డుకు ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

–నాగరాజు, డిజైనర్, ధర్మవరం

ఘనంగా పులేకమ్మ దేవి జ్యోతుల ఉత్సవం


అమ్మవారి మూలవిరాట్

హిందూపురం: స్థానిక కంసాలపేట సమీపంలో వెలసిన పులేకమ్మ అమ్మవారి జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించిన కలశాలను తలపై ఎత్తుకుని మేళతాళాలతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి సమర్పించారు. రాత్రి ఉత్సవమూర్తిని ట్రాక్టర్‌పై కొలువుదీర్చి మేళతాళాలతో ఊరేగించారు.


కలశాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

ఎస్కేయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో కొత్త ప్రోగ్రామ్‌లు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో కొత్త ప్రోగ్రామ్‌లను అందుబాటులోకి తెచ్చారు. ఈ ప్రోగ్రాంలను అమలు చేయడానికి ఏఐసీటీఈ నుంచి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుమతి పొందింది. అలాగే పాలకమండలి సభ్యులు కూడా ఆమోదం తెలిపారు. బీటెక్‌లో కంప్యూటర్ సైన్సెస్ డేటా సైన్సెస్, కంప్యూటర్ సైన్సెస్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ బ్రాంచ్‌ల ఏర్పాటుకు అప్పటి వీసీ ప్రొఫెసర్ కె.హుస్సేన్‌రెడ్డి చొరవ తీసుకున్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కింద నడిచే ఈ రెండు బీటెక్ ప్రోగ్రామ్‌లను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెట్టారు. ఒక్కో కోర్సుల్లో 60 సీట్లు కేటాయించారు. ఇది వరకు ఉన్న ఈసీఈ, సీఎస్ఈ ప్రోగ్రాంలలో సీట్లను 60 నుంచి 120కు పెంచారు. ఈ విద్యా సంవత్సరంలో బీటెక్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు తీసుకునే విద్యార్థులు ఎస్కేయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో సీట్లను ఎంపిక చేసుకునేలా ఏపీఈఏపీసెట్ వెబ్ కౌన్సెలింగ్‌లో ఉన్నత విద్యామండలి అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర తెలిపారు.

దిగజారుతున్న విద్యా ప్రమాణాలు

- ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజనేయులు


మాట్లాడుతున్న రామాంజనేయులు

అనంతపురం ఎడ్యుకేషన్: మెగా పీటీఎం, యోగాంధ్ర, ట్రైనింగులు తదితర బోధనేతర కార్యక్రమాలకు ఉపాధ్యాయులను మళ్లించడంతో రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. కాకినాడ వేదికగా ఎస్టీయూ రాష్ట్ర ద్వితీయ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. జిల్లా నుంచి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శితో పాటు పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి .రామాంజనేయులు మాట్లాడారు. ప్రశాంతమైన వాతావరణంలో బోధన అభ్యసన కార్యక్రమాలు జరిగేలా విద్యాశాఖ దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు, 12వ పీఆర్సీ వేసి వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు. అలాగే సీపీఎస్ బకాయిలు చెల్లించాలని, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్మెంట్ మూడేళ్లయినా చెల్లించలేదన్నారు. పురపాలక, నగరపాలక పాఠశాలల్లో మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అర్హత కలిగిన ఉపాధ్యాయులతో నెలవారీ ప్రమోషన్ల ద్వారా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

అధికార పార్టీకి తొత్తులుగా మారిన అధికారుల

- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి


అధికారులు తొలగించిన కంచెను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి

బత్తలపల్లి: అధికార పార్టీ నాయకులు ఏమి చెబితే అది చేస్తూ తమ అధికారాలను ప్రభుత్వాధికారులు దుర్వినియోగం చేస్తున్నారని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు చల్లా శ్రీరాములుకు చెందిన భూమి కోర్టు పరిధిలో ఉన్నా.. లెక్క చేయకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు అక్రమంగా కంచె తొలగించిన విషయం తెలుసుకున్న ఆయన ఆదివారం గ్రామానికి చేరుకుని పరిశీలించారు. కోర్టు పరిధిలో ఉన్న భూ సమస్యలో అధికారులు జోక్యం చేసుకోవడం తగదన్నారు. టీడీపీ నాయకులు చెప్పినట్లు వ్యవహరించి తమ అధికారాలను వారు దుర్వినియోగం చేశారన్నారు. రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బాధిత రైతుతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కేతిరెడ్డి వెంట జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకరరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, నాయకులు చల్లా కృష్ణమనాయుడు, చల్లా శ్రీరాములు, చల్లా మహేష్, చల్లా రంగానాయుడు, కల్చరల్ వింగ్ ప్రెసిడెంట్ షరాబ్ యోగానంద ఆచారి, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అనుమానితుల బైండోవర్

కదిరి టౌన్: పట్టణంలో ఆదివారం పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఓ లాడ్జిలో పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని బైండోవర్ చేయించారు. వీరంతా వేర్వేరు ప్రాంతాల నుంచి కదిరికి వచ్చినట్లుగా సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. బైండోవర్ అయిన వారిలో ఇస్మాయిల్ (కాళసముద్రం), రమేష్ (బ్రాహ్మణపల్లి), ఫకృద్దీన్ (ముదిగుబ్బ), వెంకటేశ్వర ప్రసాద్ (పీలేరు - అన్నమయ్య జిల్లా), రాజేంద్రకుమార్ (విజయవాడ)తో పాటు కుటాగుళ్లకు చెందిన రామాంజనేయులు, షానవాజ్, ఎరికలవాండ్ల పల్లి నివాసి గుమ్మిశెట్టి ఈశ్వరయ్య ఉన్నారు. విచారణలో పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో వారి సెల్‌ఫోన్లను పోలీసులు పరిశీలించారు. అందులో గుప్త నిధులకు సంబంధించిన ఫొటోలు ఉండడంతో, పూర్వాపరాలపై ఆరా తీశారు. ఇప్పటి వరకూ ఎలాంటి నేర చరిత్ర లేదని తెలుసుకున్న భవిష్యత్తులో నేరాలకు పాల్పడకుండా ఉండేందుకు వారి వేలిముద్రలను సేకరించి, భద్రపరిచారు. అనంతరం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయించారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది


శంకర్ నారాయణ

సాక్షి పుట్టపర్తి: రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ శంకర్ నారాయణ అన్నారు. కృష్ణా జిల్లా గుడివాడలో జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ హారికపై టీడీపీ నేతలు దాడి చేయడం దారుణమన్నారు. మహిళ అని కూడా చూడకుండా దాడులకు పాల్పడడం రెడ్ బుక్ రాజ్యాంగానికి నిదర్శనమని అభివర్ణించారు. దౌర్జన్యాలు, దాడులతో ఆంధ్రప్రదేశ్ బిహార్‌ను తలపిస్తోందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయన్నారు. మహిళలు స్వేచ్ఛగా బయట తిరగాలన్నా భయపడే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. చైర్‌పర్సన్‌పై దాడి జరిగితే ఇంతవరకు ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు.

'ఆశల్ని' ఆపేశారు!

అధికారుల అలసత్వం.. రైతులకు అశనిపాతం

- హెచ్చెల్సీలో పూర్తి కాని మరమ్మతు పనులు
- సరిహద్దులో ఆగిన తుంగభద్ర జలాలు


ఆంధ్రా సరిహద్దులో నిలిచిన తుంగభద్ర జలాలు


బొమ్మనహాళ్: రైతుల ఆశలపై అధికారులు నీళ్లు చల్లారు. ముందస్తుగా నీరొచ్చాయని పడిన సంతోషాన్ని ఆదిలోనే దూరం చేశారు. గంగపూజ నిర్వహించి స్వాగతించాల్సిన సమయంలో ఇలా జరగడం దురదృష్టకరమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర జలాశయం నుంచి ఈనెల 10న నీటిని హెచ్చెల్సీ కాలువకు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం రాత్రికి బొమ్మనహాళ్ సరిహద్దులోని 105-272 కిలోమీటర్ వద్దకు నీళ్లు చేరుకున్నాయి. అయితే, హెచ్చెల్సీలో మరమ్మతు పనులు ఇంకా కొనసాగుతుండడంతో ఇబ్బంది లేకుండా 105వ కిలోమీటర్ వద్ద రెగ్యులేటర్లను కిందికి దించి వేసి నీరు ఆంధ్రాలోకి ప్రవేశించకుండా ఆపేశారు.

పర్యవేక్షణ కరువై ఇష్టారాజ్యం..

కాంట్రాక్టర్ల అలసత్వం.. పర్యవేక్షణ ఇంజినీర్ల నిర్లక్ష్యం కారణంగా హెచ్చెల్సీలో మరమ్మతు పనులు అనుకున్నట్లుగా సాగడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 115 నుంచి 138 కిలోమీటర్ల వరకు లైనింగ్ పనులు, నాగలాపురం వద్ద, ఉద్దేహాళ్-మల్లికేతి బ్రిడ్జిలు పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో పనుల పూర్తికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది. అప్పటివరకూ నీటిని సరిహద్దుల్లోనే ఆపేయాల్సి ఉంటుంది. మరోవైపు రైతులు ఇప్పటికే బోర్ల కింద వరి నారు, మిరప నార్లు పోసుకున్నారు. తుంగభద్ర జలాలు వచ్చి ఉంటే నారుకు బాగుండేదని, బోరు నీటికి నారు పైరు ఎర్రగా మారుతుందని రైతులు వాపోతున్నారు. ఈ క్రమంలో మరమ్మతు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయించి తమకు సాంత్వన చేకూర్చాలని రైతులు కోరుతున్నారు.

చూసిన కనులదే భాగ్యం..

పుట్టపర్తి అర్బన్: మండలంలోని సుబ్బరాయునిపల్లి సమీపంలో చౌటవంకలో వెలసిన సప్తమాతృక అక్కమ్మ దేవతల జాతర ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బాలికల కుంకుమార్చన, బాలుర నెమలి ఈకల నివేదన కార్యక్రమంతో జాతర పూర్తయింది. ఈ సందర్భంగా అక్కమ్మ దేవతల మూల విరాట్‌లను విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం అక్కమ్మ దేవతలకు ప్రతీకగా ఏడుగురు బాలికలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గద్దెపై కుంకాలు చెరిగారు.ఎడ్ల బండ్లను ఊరేగించారు.


ప్రత్యేక అలంకరణలో అక్కమ్మ దేవతల మూలవిరాట్‌లు


గద్దెపై పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

'విశ్వ' ఖ్యాతి..అధోగతి

- తగ్గిపోతున్న జేఎన్‌టీయూ(ఏ) ప్రాభవం
- ఇప్పటికే 45 కళాశాలలకు అటానమస్
- వచ్చే ఏడాది అన్ని కళాశాలలకూ స్వయం ప్రతిపత్తి
- క్యాంపస్, పులివెందుల, కలికిరి కళాశాలలకే పరిమితం కానున్న వర్సిటీ


జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల

అనంతపురం: రాయలసీమకే తలమానికంగా భాసిల్లుతున్న జేఎన్‌టీయూ (అనంతపురం) క్రమంగా ప్రాభవం కోల్పోతోంది. అనుబంధ కళాశాలలన్నీ అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హోదా పొందుతుండడంతో వర్సిటీ పాత్ర పరిమితం కానుంది. అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలే వర్సిటీకి వెన్నుదన్ను. ఆయా కళాశాలల విద్యార్థులు చెల్లించే యూనివర్సిటీ కామన్ సర్వీసెస్ (యూసీఎస్) ఫీజులు వర్సిటీకి అతిపెద్ద ఆర్థిక వనరు. అయితే.. అనుబంధ కళాశాలల నుంచి స్వయం ప్రతిపత్తి కళాశాలలు (అటానమస్)గా మార్పు చెందుతున్నాయి. నూతన జాతీయ విద్యా విధానం-2020 ప్రకారం ప్రతి ఇంజినీరింగ్ కళాశాల అటానమస్‌గా మార్పు చెందాలని నిర్దేశించడం ఇందుకు ఊతంగా నిలుస్తోంది. జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలో రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లో మొత్తం 69 ఇంజినీరింగ్ కళాశాలలు అనుబంధంగా ఉండేవి. ఇందులో ఇప్పటికే 45 కళాశాలలు అటానమస్ హోదా దక్కించుకున్నాయి. మిగిలిన 24 ఇంజినీరింగ్ కళాశాలలు ప్రస్తుత (2025-26) విద్యా సంవత్సరానికి అనుబంధ కాలేజీలుగా వర్సిటీకి దరఖాస్తు చేసుకున్నాయి. వచ్చే సంవత్సరం నుంచి ఇవి కూడా స్వయం ప్రతిపత్తి పొందనున్నాయి. న్యాక్‌లో ఏ రకమైన గ్రేడ్ ఉన్నా అటానమస్ హోదా వస్తుంది. ఈ నేపథ్యంలో దరఖాస్తు చేసుకుంటే అటానమస్ హోదా ఇచ్చేస్తున్నారు. అనుబంధ కాలేజీలన్నీ అటానమస్ పొందితే జేఎన్‌టీయూ కేవలం క్యాంపస్ కళాశాల, పులివెందుల, కలికిరి, ఓటీపీఆర్ఐ కాలేజీలకే పరిమితం కానుంది.

వర్సిటీ బాధ్యతలు నామమాత్రం

అనుబంధ కాలేజీలన్నీ అటానమస్ పొందితే జేఎన్‌టీయూ(ఏ) కేవలం డిగ్రీలు అందించే కార్యాలయంలా మారిపోనుంది. సిలబస్ రూపకల్పన, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, మార్కుల కేటాయింపులో అటానమస్ కళాశాలలు స్వతంత్రంగా వ్యవహరిస్తాయి. మార్కులు వర్సిటీకి పంపితే స్నాతకోత్సవ డిగ్రీ మాత్రం అందజేస్తుంది. ఈ నేపథ్యంలో వర్సిటీ బాధ్యతలు నామమాత్రం కానున్నాయి. ఒకప్పుడు ఏటా లక్ష మంది విద్యార్థులు వర్సిటీ కింద ఉండేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 10 వేలకు పడిపోయింది. వచ్చే ఏడాది మరింత తగ్గి కేవలం మూడు వేలకు పరిమితం కానుంది. దీంతో యూసీఎస్ ఫీజులు కూడా వర్సిటీకి రావు.

పురోగతికి కానరాని చర్యలు

జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో విద్యార్థులు లేని పరిస్థితి ఏర్పడనుంది. ఈ క్రమంలో క్యాంపస్ కళాశాలలో అడ్మిషన్లు గణనీయంగా పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కాలానుగుణంగా పరిశ్రమల అవసరాలకు తగిన మానవ వనరులను అందించే దిశగా ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు సరికొత్త కోర్సులు అమలు చేస్తూ విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. అయితే 78 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన జేఎన్‌టీయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ప్రతిభావంతులైన విద్యార్థులు చదువుకునే క్యాంపస్ కళాశాలలో కొత్త కోర్సుల అమలుకు యాజమాన్యం ఆసక్తి చూపడం లేదు. బీటెక్ కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ కోర్సును ప్రవేశపెట్టేందుకు 2023లోనే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) నుంచి అనుమతి కూడా తీసుకున్నారు. పాలకమండలి ఆమోదం సైతం లభించింది. అయితే, ఇందుకు సంబంధించిన ఫైలు రాష్ట్ర ఉన్నత విద్యా మండలిలో పెండింగ్ పడిపోయింది. దీనిపై వర్సిటీ అధికారులు శ్రద్ధ పెట్టడం లేదు.

అనుమతి కోసం నిరీక్షణ



క్యాంపస్ కళాశాలలో బీటెక్ (ఏఐఎంఎల్) బ్రాంచ్‌ను ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపట్టాం. ఈ బ్రాంచ్‌ను ప్రవేశపెడితే పేద, మధ్య తరగతి విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోనే చదువుకోవచ్చు. ఉన్నత విద్యామండలి అనుమతి కోసం నిరీక్షిస్తున్నాం.

– ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, వీసీ, జేఎన్‌టీయూ(అనంతపురం)